సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం ॥ 8 ॥ డిసెంబర్ ॥ 2023



ప్రతిష్టాత్మకంగా పీఎంశ్రీ

పీఎంశ్రీ పథకానికి జిల్లాలో 32 బడులు ఎంపికయ్యాయి. మౌలిక వసతులు కల్పిస్తారు. - 8లో



విరాళాలు అందించండి

సాయుధ దళాలకు విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. తన వంతుగా విరాళం అందించారు. - 8లో



పాము కాటుతో రైతు మృతి

పొలం పనులకు వెళ్లిన రైతు పాముకాటుతో మృతి చెందారు. చిన్నహరిశ్చంద్ర పురంలో ఘటన జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా జరగనుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాకు 10వ తరగతి నుంచి పీజీ, ఇంజినీరింగ్, డిప్లమో, ఫార్మసీ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. అనేక బహుళ జాతీయ సంస్థలతోపాటు స్థానికంగా ఉన్న వివిధ కంపెనీలు, సంస్థల్లో ఉన్న ఖాళీలను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేసుకునేందుకు ఆయా సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నట్టు ప్రిన్సిపాల్ చెప్పారు. జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీయువకులు తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డు, 3బయోడేటా కాపీలు, 2 పాస్‌ఫోటోలను తమ వెంట తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూర్యచంద్ర కోరారు. మరిన్ని వివరాలకు 95509 67353, 83176 52552, 97049 60160 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. న్యాయ సేవా సదన్‌లో గురువారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం కోసం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని, ఈ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బగాది శాంతి శ్రీ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కేవీ రమణ, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్, సీడీపీఓ శోభ పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై దృష్టి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాల్లో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలని అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంద్ర ప్రసాద్ జాయింట్ కలెక్టర్లను కోరారు. ఒకే ఇంటిలో పది మంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు, వందేళ్లు నిండిన వాటిని పునః పరిశీలించి వారంలోగా ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ దరఖాస్తులపై జాయింట్ కలెక్టర్లతో అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గురువారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా జాబితా విడుదల చేసే అక్టోబర్ 27 నాటికి 0-0 నంబర్ తో ఉన్న 2206 ఓటర్లను గుర్తించామని వాటి సంఖ్యను 114కి తగ్గించగలిగామన్నరు. ఒకే ఇంటి నంబర్‌తో 10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న మిగిలిన మూడు ఇళ్లను కూడా త్వరలోనే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వాటిని కూడా సరి చేస్తామన్నారు.

వైఎస్సార్ టీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తమ్మినేని



తమ్మినేని చందనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడి (వర్కింగ్ ప్రెసిడెంట్)గా శ్రీకాకుళం జిల్లాకు చెందిన తమ్మినేని చందనరావు ఎన్నికయ్యారు. జిల్లాలోని సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చందనరావు వైఎస్సార్ టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొన్నేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అలాగే ఉత్తరాంధ్ర జిల్లాల్లో సంఘం బలోపేతానికి కృషి చేస్తుండటంతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటుండటంతో రాష్ట్ర కమిటీలో ఆయనకు స్థానం కల్పించినట్లు వైఎస్సార్ టీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్‌కుమార్ రెడ్డి, జి.సుధీర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని చందనరావు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ పదవి రావడంలో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్సీలు కల్పలత, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర రెడ్డి, రాష్ట్ర సంఘ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖాకీలకు సవాల్



వేసవి కాలం కాదు. జనం డాబాల మీదకు వెళ్లే సీజనూ కాదు. ఇంటిల్లిపాదీ యాత్రలకు వెళ్లే సమయం అంత కంటే కాదు. కానీ దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా హస్త లాఘవం చూపిస్తున్నారు. చలి కాలంలో చెమటలు పుట్టిస్తున్నారు. భారీ చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్నారు. మరోవైపు ఖాకీలు కూడా చోరుల పని పట్టేందుకు సమర్థంగా సన్నద్ధమవుతున్నారు. అర్ధరాత్రిళ్లు కూడా ఊళ్లతో పాటు దారుల్లోనూ నిఘా పెంచుతున్నారు.



రాత్రి గస్తీల్లో భాగంగా బీట్లను తనిఖీ చేస్తున్న ఎస్పీ రాధిక

- భారీ చోరీలతో పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు
- చోరుల కదలికలపై పోలీసుల నిఘా
- బయట గ్యాంగులు జిల్లాలోకి వచ్చాయని అనుమానం
- బీట్‌లు, నైట్ గస్తీల పెంపు



శ్రీకాకుళం క్రైమ్ : దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో శ్రీకాకుళం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో రెండు చోట్ల, నరసన్నపేటలో రెండు చోట్ల చోరీలకు పాల్పడి ప్రజలను ఆందోళనకు గురి చేశారు. వీరు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిని పట్టుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు జిల్లావాసులను కూడా అప్రమత్తం చేస్తున్నా రు. పోలీసులకు సహకరించాలని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఇప్పటికే దొంగల వివరాలు తెలిసేలా ఫ్లెక్సీలను ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీంతో పాటు కార్డన్‌సెర్చ్‌లను కూడా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.

గస్తీ పటిష్టం..

జిల్లాలో మూడు సబ్‌డివిజన్‌లు, 12 సర్కిల్ కార్యాలయాలతో కలిసి 34 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. గస్తీల్లో భాగంగా ముఖ్య నగరాలు, పట్టణాల్లో ఏడు గంటల నుంచి ఉదయం ఏడు వరకు సర్కిల్ పరిధిలో ఆరు నుంచి ఎనిమిది బీట్లు, గ్రామీణ మండలాల పరిధిలో మూడు నుంచి నాలుగు పోలీసు బీట్లు పాల్గొంటాయి.

ఒక్కో బీటుకు ఒక కానిస్టేబుల్, హోంగార్డు ఉంటారు. ఎస్‌హెచ్‌వో తనిఖీ చేస్తుంటారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్‌డివిజనల్ అధికారి దగ్గరుండి పర్యవేక్షిస్తుంటారు. జిల్లా కంట్రోల్ రూం ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ వీరిని అలెర్ట్ చేస్తుంటుంది. ఈ మధ్య కాలంలో ఎస్పీ రాధిక బీట్ సిస్టంలో సమూల మార్పులు చేశారు. రాత్రి గస్తీల్లో సీఐలు, డీఎస్పీలు డ్యూటీలు చేయాలని ఆదేశించారు. అంతే కాక సర్‌ప్రైజ్ చెకింగ్ అంటూ ఆమే స్వయంగా రాత్రి గస్తీల్లో పాల్గొంటూ బీట్‌లో ఉన్న పోలీసులు ఏ విధంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నది తనిఖీ చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీ కూడా వెళ్తున్నారు. అంతర్‌రాష్ట్ర దొంగలు జిల్లాలోకి ప్రవేశించారనే అనుమానంతో బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాల్సిందే..

పోలీసులు దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. మరోవైపు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని వారు సూచిస్తున్నారు. ముఖ్యంగా బయట ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించడం, ముఖ్యమైన పత్రాలు, నగదు, బంగారం లాకర్లలో పెట్టుకోవడం, ఇంటికి లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం ద్వారా పోలీసుల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, అనుమానిత వ్యక్తుల గురించి పోలీసులకు తెలియజేయడం చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను ఇప్పటివరకు 9,883 మంది డౌన్‌లోడ్ చేసుకోగా.. 498 మంది వినియోగించుకున్నారు. దీని సాయంతో పోలీసులు ఇంటి వద్ద సీసీ కెమెరా పెట్టి గస్తీ కాస్తారు. మరీ ముఖ్యంగా బంగారం, వెండి మెరుగు పెడతామనే వారితో జాగ్రత్తగా ఉండాలి. కొత్తగా ఎవరైనా టెంట్లు వేసి వ్యాపారాలు, సర్కస్, తదితర వినోద కార్యక్రమాలు నిర్వహిస్తే తప్పనిసరిగా పోలీసులు, మహిళా కానిస్టేబుల్‌కు తెలియజేయాలి.

నిరంతరం నిఘా..



ఈ మధ్య కాలంలో వరుస చోరీలు జరగడంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎస్పీ ఆదేశాలతో చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టాం. బీట్ సిస్టంలోనూ మేడమ్ సమూల మార్పులు చేశారు. అధికారులంతా రాత్రి గస్తీల్లో పాల్గొంటున్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగించాలని ప్రజలను అవగాహన పరుస్తున్నాం. 50 ఎల్‌హెచ్‌ఎంఎస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. సర్కిల్‌కు ఐదు చొప్పున ఇస్తాం. ప్రజలు పోలీసులకు సహకరిస్తే చోరీలకు అడ్డుకట్టవేసేందుకు వీలుంటుంది.

– టీపీ విఠలేశ్వరరావు, జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్)



ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్

అతివకు 'ఉన్నతి'



ఆటో నడిపే మహిళలను మరింత మంది స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కోరారు. ఆయన గురువారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లాలోని మహిళలకు ఉన్నతి యూనిట్ ద్వారా అందించిన 13 ఆటో రిక్షాలను జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఆటో రిక్షాల తాళాలను మహిళా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉన్నతి కార్యక్రమంలో నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీ లేని రుణంతో 'మహిళా శక్తి పథకం'లో ఆటో రిక్షాలు అందజేస్తోందన్నారు. జిల్లాలో మొత్తం 13 మండలాలకు సంబంధించి 13 మంది లబ్ధిదారులు వీటిని అందుకున్నారని తెలిపారు. బజాజ్ కంపెనీ ఆటోలు–10, అపే కంపెనీ ఆటోలు–3 ను లబ్ధిదారులు ఎంపిక చేసుకున్నారని, వీరికి వడ్డీ లేని రుణం ఉన్నతి ద్వారా అందించారని పేర్కొన్నారు. 48 వాయిదాల్లో అప్పు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్

ఆపత్కాలంలో రైతులకు సూచనలు



వజ్రపుకొత్తూరు మండలం బెండి వద్ద పొలాల్లో తడిచిన వరి పనలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): 'మిచాంగ్' తుఫాన్ అనంతరం పంటల నష్టం, కోత అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయిలో నాలుగు క్షేత్ర పరిశీలన బృందాలను వ్యవసాయశాఖ, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, కేవీకే శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వీరు క్షేత్ర పరిశీలనకు వెళ్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా నాలుగు క్షేత్రస్థాయి బృందాలు గురువారం పర్యటించి నష్టాలను అంచనా వేశాయి. పంట కోత జరగని విస్తీర్ణంలో సుమారు 1920 ఎకరాల్లో పంట వాలి నీట మునిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు. పనలో ఉన్న వరి విత్తనం మొలకెత్తకుండా, రంగు మారకుండా 5% ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించినట్లు తెలిపారు. ముంపు భూముల్లో నీటిని కాలువల ద్వారా బయటకు పంపించే చర్యలు తీసుకోవాలని సూచించారు. 20–45 రోజులు ఉన్న అపరాలు చేలల్లో మొక్కలు ఇవక బారకుండా తేలికపాటిగా 19:19:19, లేక మలటీ–కె, అన్నభేది కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిగా ఉండి పడిపోయిన చేలల్లో వీలైనంత తొందర్లో దుబ్బులను నిల



గార మండలం కొర్లాం గ్రామంలో పంట జాడలు తీస్తున్న రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

బెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలని, కోతకి సిద్ధంగా ఉన్నవాటిని తొందరగా కోత కోసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఏదైనా సందేహాలుంటే రైతుభరోసా కేంద్రాల్లో ఏఏఓలకు, మండల ఏడీలను సంప్రదించాలని కోరారు. వరి పరిశోధన కేంద్రం రాగోలు ప్రధాన శాస్త్రవేత్త పి.వి సత్యనారాయణ, కేవీకే కో–ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, ఏడీఏ రజని, వ్యవసాయాధికారి పద్మ, వ్యవసలహామండలి సభ్యులు పీస శ్రీహరి రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పెంపు

శ్రీకాకుళం న్యూకాలనీ: మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ప్రభుత్వం గడువు పెంచింది. వాస్తవానికి పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ముగియగా.. ఫీజులు చెల్లించలేని విద్యార్థులను, తుఫానుప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ఈనెల 11వ తేదీ వరకు గడువు పెంచింది. దీంతో రెగ్యులర్ విద్యార్థులతోపాటు గతంలో ఫెయిలైన్ విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు సైతం ఫీజులు చెల్లింపులు చేసుకోవచ్చు. వివిధ కారణాలతో పరీక్ష ఫీజులు చెల్లించని విద్యార్థులు ఈనెల 11వ తేదీలోగా చెల్లింపులు చేసేందుకు అవకాశం ఉందని ఇంటర్మీడియెట్ విద్య డీవీఈవో కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారి పి.దుర్గారావు పేర్కొన్నారు.

బహిరంగ సభకు స్థల పరిశీలన



పలాస రైల్వే క్రీడామైదానంలో సీఎం బహిరంగ సభకు పరిశీలన చేస్తున్న మంత్రి సీదిరి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్పీ రాధిక

కాశీబుగ్గ: పలాసలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ కేంద్రం ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం పలాస–కాశీబుగ్గలో జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక పర్యటించారు. ముందుగా కాశీబుగ్గ పాత జాతీయ రహదారిలో ఉన్న కిడ్నీ పరిశోధనా కేంద్రం, ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండ్ అయ్యే ప్రాంతం పరిశీలించారు. అలాగే బహిరంగ సభ కోసం పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న రైల్వే క్రీడా మైదానాన్ని పరిశీలించారు. మంత్రి సీదిరి అప్పలరాజు కూడా రావడంతో ఆయనతో చర్చించారు. కార్యక్రమంలో జేసీ నవీన్, పలాస ఆర్డీఓ భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మకరాంపురంలో..

కంచిలి: మకరాంపురంలో నిర్మించిన పంప్‌హౌస్‌ను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్న నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. అంపురం వద్ద జాతీయ రహదారి పక్కన గల ఖాళీ స్థలంలో హెలీప్యాడ్ ఏర్పాటు పనులను కూడా వీరు పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్, ఆర్డీఓ భరత్‌నాయక్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంపురం వద్ద హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎస్పీరాధిక, పిరియా సాయిరాజ్

సంక్షేమ పథం



జగనన్నకు రుణపడి ఉంటాం



నాకు 66 ఏళ్లున్నా వృద్ధాప్య పింఛన్ వచ్చేది కాదు. ఆధార్‌కార్డు డేటా ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో పింఛన్‌కు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయేది. ఈ సమస్యను గుర్తించిన గ్రామ వలంటీర్ సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లారు. వారంతా కలిసి నన్ను జిల్లా కేంద్రంలో ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆధార్ డేటా ఆన్‌లైన్‌లో వచ్చేలా చేయించారు. వెంటనే దరఖాస్తు చేయడంతో పింఛన్ మంజూరైంది. సచివాలయ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడింది. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– దంగల గన్నెయ్య, కొరపాం, ఆమదాలవలస మండలం

కల నెరవేరింది..



పదేళ్లుగా సొంతింటి కోసం కలలు కంటున్న మా కల నేటికి నెరవేరింది. జగనన్న ముఖ్యమంత్రి కావడంతో మా బతుకులకు భరోసా వచ్చింది. రోజువారీ కూలీలు కావడంతో ఇంటి స్థలం ఉన్నా ఇల్లు కట్టుకునేందుకు సొమ్ము లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సాయం చేయడంతో ఇల్లు నిర్మించుకోగలిగాం. జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– పోతురాజు రమణమ్మ, రాపాక, పొందూరు మండలం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సరుబుజ్జిలి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సింధువాడ రైతుభరోసాకేంద్రంలో గురువారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ప్రభుత్వం అందించిన మద్దతు ధర ప్రకారం మాత్రమే కొనుగోలు చేయాలని, దళారీల ప్రమేయం ఏ మాత్రం ఉన్నా క్షమించేది లేదని అన్నారు. అలాగే షళంత్రి, పెద్దసవళాపురం గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీలు జీవీ శివానందమూర్తి, అనిల్‌కుమార్, స్థానిక సర్పంచ్ గోవింద కామేశ్వరి, మండలపార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఇంఛార్జ్ తర్లాడ శ్రీనివాసరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కె. చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సింధువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం

డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మిచాంగ్ తుపాను నేపథ్యంలో 5, 6 తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ పరీక్షలు ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెగ్యులర్, సప్లిమెంటరీ విధానంలో పరీక్షకు 10,481 మంది హాజరవుతున్నారు. జిల్లాలో 99 కళాశాలలు ఉండగా, 54 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పరీక్షలు పర్యవేక్షించారు.

'మన విశాఖ.. మన రాజధాని'



మన విశాఖ.. మన రాజధాని అని పరిపాలన వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు.ఆయన గురువారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో నినాదాలు చేయించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్టణంలో పరిపాలనా రాజధాని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మనందరి భవిష్యత్ కోసం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ఉత్తరాంధ్ర ప్రజలంతా రుణపడి ఉండాలని లజపతిరాయ్ కోరారు. కార్యక్రమంలో ఆట్ల రాహుల్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

–టెక్కలి

ప్రతిష్టాత్మకంగా పీఎంశ్రీ

- జిల్లాలో 32 పాఠశాలల ఎంపిక
- కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల కేటాయింపు
- విద్యలో మార్పులు, మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

కంచిలి:

విద్యా వికాసమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్(పీఎంశ్రీ) పేరిట ప్రత్యేక పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకురావడం, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం పథకం ముఖ్య ఉద్దేశం. దీని కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే మిగతా 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగాఅమలు చేసేందుకు చర్యలు చేపడుతోంది.

48 అంశాలు ప్రాతిపదికగా..

పీఎంశ్రీ పథకానికి 2021–22 యూ డైస్ జాబితా ఆధారంగా 48 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని శ్రీకాకుళం జిల్లాలో 32 పాఠశాలలను గుర్తించారు. ఆ వివరాలను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించారు. అరవై శాతం మార్కులు సాధించిన గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను పథకానికి ఎంపిక చేశారు.

మౌలిక వసతుల కల్పన..

పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యాబోధన, సదుపాయాలు మరింతగా మెరుగుపరుస్తారు. అదనపు తరగతి గదులు నిర్మిస్తారు. అదనపు వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూరుస్తారు. ఏ మేరకు పనులు చేపట్టాలనే అంశంపై జిల్లాస్థాయి కమిటీలు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.



మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

ఎంపికైన పాఠశాలలివే..

1.ఏపీ మోడల్ స్కూల్, ఈదులవలస, 2.ఏపీ మోడల్ స్కూల్, కరవాంజ, 3.ఏపీ మోడల్ స్కూల్, ఓ.వి.పేట, 4.ఏపీ మోడల్ స్కూల్, కొండములగాం, 5.ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఎచ్చెర్ల, 6.ఏవీఎస్ఎంహెచ్ఎస్, గుజరాతిపేట, 7.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇచ్ఛాపురం, 8.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తూరు, 9.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నరసన్నపేట, 10.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాతపట్నం, 11.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పొందూరు, 12. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతబొమ్మాళి, 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సోంపేట, 14.ఎంపీఎల్ యూపీఎస్, గేదెలవానిపేట, 15.ఎంపీపీఎస్ బ్రాహ్మణతర్లా, 16. ఎంపీయూపీఎస్ సుభలయి, 17.జెడ్పీహెచ్ఎస్, టెక్కలి, 18.జెడ్పీహెచ్ఎస్ అంపోలు, 19. జెడ్పీహెచ్ఎస్ బుడితి, 20.జెడ్పీహెచ్ఎస్ చాపర, 21. జెడ్పీహెచ్ఎస్ హరిపురం, 22.జెడ్పీహెచ్ఎస్, డి.బొండపల్లి, 23.జెడ్పీహెచ్ఎస్ కరకవలస, 24.జెడ్పీహెచ్ఎస్, కాశీబుగ్గ, 25.జెడ్పీహెచ్ఎస్, కొత్తశాసనం, 26.జెడ్పీహెచ్ఎస్, కురుడు, 27.జెడ్పీహెచ్ఎస్, మఠం సరియాపల్లి, 28.జెడ్పీహెచ్ఎస్, నందిగాం, 29.జెడ్పీహెచ్ఎస్, పాతటెక్కలి, 30.జెడ్పీహెచ్ఎస్, రాజపురం, 31.జెడ్పీహెచ్ఎస్, సింగుపురం, 32.జెడ్పీహెచ్ఎస్, వెంకటాపురం

హెచ్ఎంల నుంచి ప్రతిపాదనలు..

పాఠశాలల్లో ఎలాంటి అదనపు వసతులు కల్పించాలనే అంశంపై ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులే నివేదికలు సమర్పించారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే విద్యాశాఖ హెచ్ఎంలకు మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో హెచ్ఎంలు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్ష ప్రాజెక్టుకు పంపించారు. పథకం కింద ఐదేళ్లపాటు పాఠశాలలకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు పథకం వల్ల రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక హంగులకు సాంకేతికతను జోడిస్తున్నారు. తరగతి గదులను డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దుతున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

- పాఠశాలలకు దశలవారీగా నిధుల కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు
- ఉపాధ్యాయులకు శిక్షణ, ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు
- ప్లాస్టిక్‌రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం, సంప్రదాయ విధానలపై విద్యార్థులకు అవగాహన
- హరిత పాఠశాలలుగా మార్చడం
- బడి ఆవరణలో సేంద్రియ విధానంలో కూరగాయల సాగు
- దివ్యాంగవిద్యార్థులకు బోధన పరికరాల ఏర్పాటు
- బాలిక విద్య అభివృద్ధి, సైన్స్ ప్రాజెక్టులు
- అందుబాటులోకి గ్రంథాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం

సంతోషంగా ఉంది..



పీఎంశ్రీ పథకానికి పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది.అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వస్తాయి. పాఠశాల కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందనుంది.
– భాస్కర్ రౌళో, హెచ్ఎం, మఠం సరియాపల్లి జెడ్పీ హైస్కూల్, కంచిలి మండలం

సౌకర్యాల కల్పన..



జిల్లా నుంచి 32 పాఠశాలలను ఎంపిక చేశాం.అత్యాధునిక వసతులు, మౌలిక సౌకర్యాల కల్పన తదితర చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులతో చేపడతాం.
– జి.లక్ష్మీనారాయణ, ఏఎంఓ, సమగ్ర శిక్ష, శ్రీకాకుళం

క్లుప్తంగా

ప్రతి గింజా కొంటాం


కరవంజలో ధాన్యం పరిశీలిస్తున్న డీఎం శ్రీనివాసరావు, అధికారులు

జలుమూరు: ఖరీఫ్‌లో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని జిల్లా సివిల్ సప్లయ్ డీఎం కె.శ్రీనివాసరావు అన్నారు. ఆయన గురువారం కరవంజ గ్రామంలో కల్లాలు, రోడ్ల మీద నిల్వ ఉన్న ధాన్యంను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆఫ్‌లైన్‌లో కొనుగోలుకు అవకాశం ఉందని, అయితే మండల పరిధిలో కేవలం మూడు మిల్లులు ఉండడంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు నరసన్నపేట, సారవకోట మండలాల మిల్లులకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు ఏఓ కె.సురేష్‌కు మార్ సిబ్బంది,రైతులు ఉన్నారు.


573 పోస్టల్ కార్యాలయాల్లో బీమా సేవలు

కోటబొమ్మాళి: జిల్లాలోని 573 పోస్టల్ కార్యాలయాల్లో ఖాతాదారులకు కొత్తగా బీమా సేవలు అందజేస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. కోటబొమ్మాళి సబ్‌పోస్టల్ కార్యాలయంలో గురువారం ఖాతాదారులకు బీమా సేవలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. టాటా ఏఐజీ బీమా సంస్థ ఇండియన్ పోస్టల్ పేమెంటు బ్యాంకుతో బీమా సేవలు అందజేసేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పాలసీ కావాలనుకునే వారు ఆధార్, దానికి లింకైన ఫోన్ నంబర్‌తో దగ్గరలోని పోస్టాఫీస్‌కు వెళ్లాలని సూచించారు.

'మహాసభలు విజయవంతం చేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు తెలిపారు. ఆయన గురువారం రెవెన్యూ వసతి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే మహాసభకు జిల్లా నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారికి మెరుగైన జీతభత్యాలు, వైద్యం, ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాల కోసం పోరాడుతున్నట్లు తెలిపారు.

పాము కాటుతో రైతు మృతి


గోవిందరావు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన రైతు గురువెల్లి గోవిందరావు (45) పాము కాటుకు గురై గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గోవిందరావు గురువారం తన పొలంలో కుటుంబసభ్యులతో కలిసి తుఫాన్‌కు తడిచిన వరి చేను గట్టుపై ఆరబెడుతుండగా ఆయనను పాము కాటు వేసింది. దీంతో పొలంలోనే ఆయన మృతి చెందారు. గోవిందరావుకు భార్య లక్ష్మి, ఇంటర్ చదువుతున్న కుమారుడు మణికంఠ, టెన్త్ చదువుతున్న కుమార్తె కావ్య ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహానికి కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

మంత్రి సహకారంతో..


పలాసకు చెందిన అయ్యప్పస్వాములు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో విశ్వ బ్రాహ్మణ కుటుంబాలకు చెందిన అయ్యప్ప స్వామి మాలధారులను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదుకున్నారు. పలాస నుంచి శబరిమలై యాత్రకు మూడు రోజుల కిందట వెళ్లిన వారంతా దర్శనం అనంతరం చెన్నైకు చేరుకున్నారు. తుఫాన్ కారణంగా రైళ్లు రద్దు కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. మంత్రికి విషయం తెలియడంతో ఆయన స్పందించారు. నెల్లూరులో ఉన్న ఆప్కాబ్ చైర్మన్ అనిల్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల, మత్స్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో వారు పలాస వాసులకు సహకరించారు. చెన్నై నుంచి పలాసకు ప్రత్యేక బస్సు వేశారు. వీరంతా శుక్రవారం ఇక్కడకు చేరుకుంటారు. దీంతో వీరు మంత్రి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

215 పాఠశాలల ఆడిట్

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మందస మండలం పరిధిలోని 215 ప్రభుత్వ పాఠశాలల ఆడిట్‌ను ఆడిటర్ ప్రదీప్ రెడ్డి టీం సభ్యులు సోంపేట బాలికోన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. ఐదు మండలాల పరిధిలోని 50 శాతం పాఠశాలలకు సంబంధించిన నిధులపై ఆడిట్ నిర్వహించినట్లు ప్రదీప్ తెలిపారు. ఉపాధ్యాయులు రికార్డులు సక్రమంగా నిర్వహించడంతో పాటు నిధులు సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఆడిట్ నిర్వహణలో విద్యాశాఖాధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజు, ఎస్.శివరాం ప్రసాద్, ఎం.ధనుంజయం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

- జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు


బీసీ రథయాత్రను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, లాకా వెంగళరావు

కంచిలి: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు అన్నారు. కంచిలిలోని రాధాకృష్ణ ఆలయం నుంచి బీసీ రథయాత్రను ఆయనతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ బీసీల కోసం చేస్తున్న స్వాతంత్ర్య పోరాటమని పేర్కొన్నారు. తమ కులగణన డిమాండ్‌ను ఒక్క సీఎం వైఎస్ జగన్ మాత్రమే అమలు చేస్తున్నారని, ఆయనకు కృతజ్ఞతలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లోని 100 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రథయాత్ర చేసి తిరుపతిలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలకు రాష్ట్రంలో 90 ఎమ్మెల్యే స్థానాలు, 13 ఎంపీ స్థానాలు కేటాయించాలని, జాతీయ పార్టీలు 275 పార్లమెంట్ స్థానాలను బీసీలకు ఇవ్వాలన్నారు. జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశ ప్రధానిగా బీసీ నేత నరేంద్ర మోదీ ఉన్నప్పటికీ బీసీ మహిళా బిల్లు పెట్టడానికి వెనుకాడటం బాధాకరమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్‌లో చెప్పినవన్నీ అమలు చేస్తున్నారని, బీసీలను రాజ్యసభకు, శాసన మండలికి పంపించారని గుర్తు చేశారు. బీసీల్లోని 139 కులాలను గుర్తించి, వారికి 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. ఒక బీసీనైన తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని శాసన మండలి సభ్యుడు నర్తు రామారావు అన్నారు. దేశంలో బీసీల జనాభా ప్రాతిపదికన రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని జాతీయ యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, బీసీ సంఘం ప్రతినిధులు ఆవుల నర్సింహరావు, నర్తు నరేంద్రయాదవ్, చంద్రశేఖర్, నూకాలమ్మ, ఎస్.ఎస్. యాదవ్, సాలిన లక్ష్మణమూర్తి, కొర్రాయి వాసు, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తడక యశోద, నేతలు ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, కడియాల ప్రకాశ్, వజ్జ మృత్యుంజయరావు, కోరాడ అప్పారావు, ఆనాల శివగోపి తదితరులు పాల్గొన్నారు.

'ట్రస్టు సేవలు వినియోగించుకోండి'


రేవతీపతి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఏయూ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, కిల్లి కృపారాణి, కొర్ల శిరీషా శ్రీనివాస్, లజపతిరాయ్

టెక్కలి: కొర్ల రేవతీపతి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్, పూర్వపు వీసీ హెచ్.లజపతిరాయ్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి కోరారు. కొర్ల రేవతీపతి వర్ధంతి సందర్భంగా గురువారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ట్రస్టు చైర్ పర్సన్ కొర్ల శిరీషా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. శిక్షణ కేంద్రాన్ని గ్రామీణ ప్రాంత ఉద్యోగార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్వపు వీసీ లజపతిరాయ్ మాట్లాడుతూ ట్రస్టు సేవలను నిరుద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి ఆశయ సాధనలో భాగంగా శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ కొర్ల శిరీషా శ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనలో భాగంగా విద్యా, వైద్యం, సాహిత్యం, సామాజిక అంశాలతో ట్రస్టు సేవలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పోర్టు, గ్రానైట్‌కు సంబంధించిన అంశాలతో డిగ్రీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా కోర్సులను అమలు చేయాలని యూనివర్సిటీ అధికారులను కోరారు. కార్యక్రమంలో టెక్కలి మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, టెక్కలి, పాతపట్నం డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు టి.గోవిందమ్మ, కె.శ్రీరాములు సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్‌రెడ్డి, ట్రస్టు ఆర్గనైజర్ చిగిలిపల్లి శ్రీనివాస్, నాయకులు చింతాడ గణపతి, కోత మధు, ఎన్ని మన్మథరావు, ఆట్ల రాహుల్, కొర్ల అనిల్, శివారెడ్డి, ఎస్.వి.రమణమూర్తి, పి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కె.సతీష్, అధ్యాపకులు చంద్రారెడ్డి, సుదర్శనరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతుకు మేలు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగిస్తున్న పద్మావతి తదితరులు

ఎల్ఎన్ పేట: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించటం, సేంద్రియ సాగుపై దృష్టి సారించటం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఎల్.ఎన్.పేట మండలం మెంటార్ ఎం.పద్మావతి అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం లేకుండా సేంద్రీయ సాగు పద్ధతులు పాటించటం వల్ల భూసారం కాపాడుకోవచ్చన్నారు. ఎలాంటి రసాయన అవశేషాల్లేని పంట దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడి తగ్గుతుందని వివరించారు. గతం కంటే ఇప్పుడు ఎక్కువ మంది రైతులు ప్రకృతి సాగు పద్ధతులపై అవగాహన చూపిస్తున్నా రని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ, బి.లలిత, పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల ఎన్నిక

మందస: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శిగా గున్న రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హరిపురంలో గురువారం సంఘ అధ్యక్షుడు జగదీష్‌బడిత్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరిద్దరినీ ఎన్నుకున్నారు. వరుసగా మూడుసార్లు రాష్ట్ర కౌన్సిలర్‌గా కోదండరావు, జిల్లా కౌన్సిల్‌లో నూతనంగా స్థానం పొందిన రమేష్‌ను సంఘ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పూర్వపు కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కొర్ల తేజేశ్వరరావు, సహాధ్యక్షుడు గంట గోపాలకృష్ణ, ప్రియాంక మహరణ, శిస్టు సోమనాథ్, కంచరాన మాధవరావు, పిన్నింటి కొండలరావు పాల్గొన్నారు.

దుకాణం అరుగుపై మృతదేహం


అంబులెన్సులో మృతదేహాన్ని తరలిస్తున్న ఎస్ఐ కామేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కస్పా వీధిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ–2 పి.కామేశ్వరరావు తెలిపారు. డ్రైఫ్రూట్స్ దుకాణం అరుగు మీద మృతదేహం కనిపించడంతో స్థానికులు వీఆర్ఓ నాగేశ్వరరావుకు సమాచారం అందజేశారు. ఆయన వచ్చి వాకబు చేయగా చనిపోయింది బోడెమ్మ కోవెల సమీపంలో నివాసం ఉంటున్న గంటల గిరి (39) అని తెలిసింది. గిరి భార్య ఇదివరకే చనిపోయారు. కుమారుడు, కుమార్తె ఇద్దరూ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. స్థానికంగా ఈయనకు బంధువులు పెద్దగా లేరు. వీఆర్ఓ పోలీసులతో పాటు పిల్లలకు కూడా సమాచారం అందజేశారు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో పోలీసులు వీఆర్ఓకే బాధ్యతలు అప్పగించి కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మృతదేహం రిమ్స్‌కు తరలించారు.

దొంగల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు

నరసన్నపేట: స్థానికంగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశామని అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. నరసన్నపేటలో ఇటీవల చోరీ జరిగిన దంత వైద్య నిపుణులు గురుదేవ్ ఇంటిని ఆయన గురువారం పరిశీలించారు. గురుదేవ్ భార్య, సీతంపేట ప్రభుత్వ ఆస్పత్రి దంత వైద్య నిపుణురాలు రేణుకను ప్రశ్నించి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ అంతర్‌రాష్ట్ర ముఠా గత నెల 9 నుంచి డిసెంబర్ 3 వరకు పలు చోట్ల చోరీలకు పాల్పడ్డారని, వీరు మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు తెలుస్తోందని చెప్పారు. ఈ ముఠా కేవలం అపార్ట్‌మెంట్‌లలోనే చోరీలకు పాల్పడుతుందని, ఎంత మంది ఉన్నారు, ఏ వాహనాల్లో తిరుగుతున్నారో ఆరా తీస్తున్నామని అన్నారు. ఏఎస్పీ వెంట నరసన్నపేట సీఐ ప్రసాదరావుతో పాటు విజయనగరానికి చెందిన పోలీసు అధికారులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వర్

విరాళాలు అందించండి: కలెక్టర్


విరాళం అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాయుధ దళాల పతాక దినోత్సవానికి అందరూ విరాళాలను అందించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ, మాజీ సైనిక జిల్లా అధ్యక్షుడు కె. పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ, నేవీ ప్రతినిధి ఎస్.రమణమూర్తి, ఆర్మీ ప్రతినిధి పి.మురళీధరరావులను కలిశారు. ముందుగా సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ తన వంతు విరాళం అందించారు. జవాన్లకు మనం రుణపడి ఉన్నామని, అమరుల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తామని, పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని ఆయన కోరారు. అందించే విరాళాలను, డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు /డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, పెద్దరెల్లి వీధి, శ్రీకాకుళంకు పంపవలసిందిగా ఆయన కోరారు. ఎన్‌సీసీ విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వచ్చి విరాళాలు సేకరిస్తారని, వారికి పతాక నిధి విరాళాలను విరివిగా అందించాలన్నారు.